సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 29 । మార్చి । 2023



తల ఒక చోట.. మొండెం మరోచోట
భూవివాదంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. 8లో



బీఆర్‌ఎస్‌కి కార్యకర్తలే బలం
బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం అని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్ అన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సైనికుల వలే పని చేయాలన్నారు. 9లో



ఉత్తమ ఫలితాలే లక్ష్యం
పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. 9లో



రెండు రోజులు.. రూ.76 కోట్లు

- హడావిడిగా ఉపాధి హామీ సీసీ రోడ్ల పనులు
- మార్చి 31లోగా ప్రారంభించకపోతే నిధులు వెనక్కి
- కూలీల మస్టర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించేందుకు క్షేత్ర స్థాయి సిబ్బంది తంటాలు పడుతున్నారు. ఈ పనులు ప్రారంభించేందుకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఇప్పుడు హడావిడిగా ఈ పనులను షురూ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పనులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు అంటే మార్చి 31లోగా ప్రారంభించని పక్షంలో జిల్లాకు మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోతాయి. దీంతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు ఈ పనుల ప్రారంభానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆయా సీసీ రోడ్లకు సంబంధించి లేబర్ కాంపోనెంట్ కింద ఉపాధి హామీ కూలీలు పనిచేసినట్లు మస్టర్లను ఉపాధి హామీ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నిధులు వృథా కాకుండా చూస్తున్నారు. కొన్ని మండలాల్లో ఈ ప్రక్రియ పకడ్బందీగా జరగకపోవడంతో వచ్చిన నిధుల్లో కొన్ని ల్యాప్స్ అయ్యే అవకాశాలే కనిపిస్తున్నాయి.

రూ.76 కోట్లు.. 952 సీసీ రోడ్లు

ఉపాధి హామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.76 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో జిల్లా వ్యాప్తంగా 952 సీసీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో కొన్ని చోట్ల డ్రైనేజీలు, మెటల్‌రోడ్ల నిర్మాణం పనులు కూడా ఉన్నాయి. ఈ ఏడాది జూలై నుంచి విడతల వారీగా పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. మొత్తం నాలుగు విడతలుగా పనులకు అనుమతులు ఇచ్చారు. కానీ వెంటవెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఇప్పుడు



ఇంత హడావిడి పడాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ క్షేత్ర స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షించాల్సిన అధికారులు అలసత్వం కారణంగా పనులకు వెంటవెంటనే శ్రీకారం చుట్టలేదు. దీంతో ఇప్పుడు గడువు దగ్గర పడటంతో పనులు ప్రారంభించేందుకు తంటాలు పడుతున్నారు.

కూలీల పని దినాలనుబట్టి..

జిల్లాలో 647 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 4.12 లక్షల మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. ఇందులో 2.34 లక్షల మంది మాత్రమే రెగ్యులర్‌గా పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ఈ కూలీలు పనిచేసిన రోజులను బట్టి మెటీరియల్ కాంపోనెంట్ నిధులు జనరేట్ అవుతుంటాయి. ఎక్కువ మంది కూలీలు పనిచేస్తే ఎక్కువ నిధులు అందుబాటులోకి వస్తాయి. ఇలా జిల్లాకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో జనరేట్ అయిన రూ.76 కోట్లతో సీసీ రోడ్లు, ఇతర పనులను చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఎప్పటికప్పుడు ఈ పనులను ప్రారంభిస్తే ఇలా గడువు దగ్గర పడినప్పుడు హడావిడిగా పనులు షురు చేసేందుకు తంటాలు పడాల్సిన అవసరం ఉండేది కాదు. ఈ పనుల ప్రారంభం, నిధులు ల్యాప్స్ విషయమై 'సాక్షి' పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీశ్వర్‌ను సంప్రదించగా స్పందించలేదు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో షెడ్యూల్ కులాలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. భావితరాలకు మహనీయుల జీవిత చరిత్ర తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలను నిర్వహించాలని సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను, టీఎస్‌ఎస్ కళాకారులతో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. విగ్రహాల చుట్టూ పారిశుధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలని, విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, వివిధ జెండాలను తొలగించాలని సూచించారు. విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉత్సవాలు సజావుగా జరిగేలా భద్రత ఏర్పాట్లు చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వాణి విశ్వనాథ్, షెడ్యూల్ కులాల అభివృద్ధి, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫిరంగి, డీఎస్పీ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 118 కేంద్రాలు

కలెక్టర్ డాక్టర్ శరత్

జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై విద్య, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు 118 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 21,413 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మ.12.30 వరకు జరుగుతాయని, విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకునేలా చూడాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వేసవి దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా రూట్ల వారీగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వాణి విశ్వనాథ్, ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి విజయ, అసిస్టెంట్ ఎగ్జామినేషన్స్ అధికారి మణిదీపిక, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీ సేవలపై ఆరా



న్యాల్‌కల్ ఆస్పత్రి ఆవరణను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం న్యాక్ (జాతీయ నాణ్యతా ప్రమాణాల లెక్కింపు) బృందం సందర్శించింది. ఉదయం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన బృందం సభ్యులు ఆర్‌కె పట్ని, సాబేర్ పాటిల్ తదితరులు రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, ఆస్పత్రిలో ప్రసవాలు, మందుల పంపిణీ ఎలా ఉంది? ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రత తదితర అంశాలను బృందం సభ్యులు పరిశీలించారు. జాతీయ ప్రమాణాలకు సంబంధించిన అన్ని అంశాలను బృందం సభ్యులు తెలుసుకున్నారు. పరిశీలించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని బృందం సభ్యులు తెలిపారు. వారి వెంట వైద్యురాలు స్వేతప్రియ, సిబ్బంది మార్తా తదితరులు ఉన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేత మొహంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది పని తీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ గాయత్రి, డీప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగనిర్మల పాల్గొన్నారు.

తారా కళాశాలలో న్యాక్ బృందం



రికార్డులను పరిశీలిస్తున్న సభ్యులు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం రెండో రోజు కూడా సందర్శించింది. మంగళవారం తారా కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ బోనాలు, బతుకమ్మ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల పట్ల న్యాక్ త్రిసభ్య కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. రెండో రోజు న్యాక్ త్రిసభ్య కమిటీ సభ్యులు కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సహ పాఠ్యాంశాలను పరిశీలించారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, ఏకో క్లబ్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఐసీసీ, వాటర్ హార్వెస్టింగ్, వర్మీ కంపోస్ట్ ఏర్పాటు, జిమ్, స్పోర్ట్స్, ఆటలు వంటి సదుపాయాలను పరిశీలించి, రికార్డులనయ తనిఖీ చేశారు. ఆర్వో వాటర్ ప్లాంట్, గ్రీన్ లైబ్రరీ, బొటానికల్ గార్డెన్లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పరీక్షల్లో చివరి రోజైన మంగళవారం ప్రథమ సంవత్సరం సీఈసీ విద్యార్థులకు కామర్స్, ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు రసాయన శాస్త్రం పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 19,785 మంది విద్యార్థులకు 18,834 మంది హాజరు కాగా 951 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి గోవింద్‌రాం తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల శాతం 95.19గా నమోదైంది. డీఐఈఓ మూడు, డీఈసీ సభ్యులు ఐదు, హెచ్‌పీసీ సభ్యులు ఐదు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఎనిమిది, సిట్టింగ్ స్క్వాడ్లు నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రజలు, ప్రభుత్వానికి వారధి కార్యకర్తలే..

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం పాటి గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన మండల స్థాయి పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. రాబోయే రోజుల్లో అవలంబించాల్సిన విధి విధానాలపై పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. కార్యకర్తలకు పార్టీ రుణపడి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు సీఎస్‌ఆర్ నిధులతో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణకు పెద్దపీటవేసిన మహోన్నత నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రజలు తెలివైన వారని, కులం మతం పేరుతో విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో ఒక్క గుడికి సున్నం వేయని బీజేపీ నాయకులు నేడు హిందూ మతానికి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతినిధుల మని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. లౌకిక వాదానికి పెద్దపీటవేస్తూ నియోజకవర్గంలో 170కి పైగా గుడులు, మసీదులు, ఆశిర్ఖానాలు, దర్గాలు చర్చిలను నిర్మించినా ఎప్పుడూ ప్రచార అర్భాటాలకు తావివ్వలేదన్నారు. ఓటు అడిగే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజా, పార్టీ మండల అధ్యక్షుడు పాండు, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాలక వర్గం ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



రాజీవ్‌చౌక్‌లో దీక్ష చేస్తున్న సురేశ్ షెట్కార్

ఖేడ్‌లో కాంగ్రెస్ నిరసన దీక్షలు

నారాయణఖేడ్: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ నారాయణఖేడ్‌లోని రాజీవ్‌చౌక్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ ఆధ్వర్యంలో, మరో టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో తన స్వగృహం ఎదుట వేర్వేరుగా నిరసన దీక్షలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దీక్షలు కొనసాగాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీరును తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీర్ణించుకోలేకపోతున్నాయని పేర్కొన్నారు. సురేశ్ షెట్కార్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలో టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, కర్నె శ్రీనివాస్, నాయకులు నగేశ్‌షెట్కార్, జితేంద్రనాథ్ షెట్కార్, సాగర్ షెట్కార్ తదితరులు పాల్గొనగా డాక్టర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలో ముఖ్య నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, దారం శంకర్, రాజేశ్‌చౌహాన్, అశోక్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మరో ఆరుగురికి కరోనా

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 31 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 23 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

జోగినాథ ఉత్సవాలకు రూ.20 లక్షలు

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): జోగిపేటలోని జోగినాథ స్వామి జాతర ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం తరఫున రూ.20 లక్షలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తెలిపారు. మంగళవారం జాతర ఉత్సవాల్లో భాగంగా రథశిఖర స్థాపనకు సంబంధించిన పూజ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆలయ పూజారీ భద్రప్ప, సుజిత్‌ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర ఉత్సవాలను గతేడాది కంటే ఇప్పుడు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయించానని తెలిపారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని రథోత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. జాతరకు మంజూరైన నిధుల మంజూరు పత్రాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు.

రథశిఖర స్థాపన

జోగినాథ రథోత్సవాల్లో భాగంగా మంగళవారం రథశిఖర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



రథశిఖర సామగ్రి పూజలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రథంపై ఏర్పాటు చేసే ఇత్తడితో తయారు చేసిన గుండ్లు, త్రిశూలం, చక్రం వంటి వస్తువులను భక్తులు ఊరేగింపుగా గౌని వరకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పి.శివశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్.సురేందర్‌గౌడ్, రంగ సురేశ్, డి.శివశంకర్, మాజీ ఏఎంసీ చైర్మన్లు మల్లికార్జున్, డీబీ.నాగభూషణం, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు రామాగౌడ్, నాయకులు చాపల వెంకటేశం, కమిటీ సభ్యులు తుపాకుల సునిల్, నర్రా నగేష్ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో మెరిసిన 'సింగూరు' విద్యార్థులు

పుల్‌కల్(అందోల్): అంతర్జాతీయ చిత్రలేఖన పోటీల్లో సింగూరు గురుకుల విద్యార్థులు సత్తాచాటారని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ నెల 5న ముంబాయికి చెందిన ఓ సంస్థ రంగోత్సవ్ పేరుతో అంతర్జాతీయ స్థాయిలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో పాల్గొన్న గురుకుల విద్యార్థులు 11 మంది బహుమతులు గెలుచుకున్నారు. కార్టున్ మేకింగ్ విభాగంలో మాలిక్ సోయం, గ్రీటింగ్ కార్డు విభాగంలో చందు, కె.నితీశ్, మహేందర్, అక్షయరాజ్, (హ్యాండ్ రైటింగ్), సజయ్‌దత్(టాటు మేకింగ్), సుశాంత్(కార్టున్ మేకింగ్), ప్రవీణ్‌కుమార్, కార్తీక్(కలరింగ్), కౌషిక్(స్కెచ్చింగ్), అంతేకాకుండా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణకు ఇండియన్ ఆర్ట్ మార్ట్ అవార్డు, చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీపాద్‌కు ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అవార్డు లభించిందని ప్రిన్సిపాల్ తెలిపారు.



చిత్రలేఖనంలో బహుమతులు సాధించిన విద్యార్థులు

మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అస్తవ్యస్తం



మాట్లాడుతున్న సాంబశివరావు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కొండాపూర్(సంగారెడ్డి): మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అస్తవ్యస్తంగా తయారైందని, ప్రజాస్వామ్యంలో గెలిచిన ప్రభుత్వాలను డబ్బులతో కొనుగోలు చేసి అన్ని రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేయాలని చూస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. మంగళవారం సంగారెడ్డిలోని టీఎన్‌జీఓ భవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ దేశ ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చు పెట్టి జాతిని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మోదీ అవినీతి పాలనను ప్రశ్నించే వారిపై ఎంక్వైరీల పేరుతో దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. సీబీఐ, ఈడీని తమ జేబు సంస్థలుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌తో ఇప్పటివరకు ఎలాంటి పొత్తు లేదని, కేవలం కొన్ని అంశాల వారీగానే మద్దతు తెలుపుతున్నామన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీని ఓడించే పార్టీలకు ఎప్పుడూ తమ మద్దతు ఉంటుందన్నారు. రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తూ కేంద్రం తమ అవసరాలకు అనుగుణంగా సవరణలు చేస్తుందన్నారు. ప్రజా సమస్యలే పరిష్కారంగా సీపీఐ ఎప్పుడూ ప్రజల పక్షానే పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ వేసిన శిక్ష మరణ దండన వంటిదని, రాహుల్ మాట్లాడిన మాటల్లో ఏ తప్పు లేదన్నారు. మోదీతో పాటు బీజేపీ నాయకులు తమ ఇష్టానుసారంగా ఎంతో మందిని అవమానించారని, అందుకు వారిని ఎన్నో సార్లు జైలులో పెట్టాల్సివస్తుందో ఒక సారి అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింహ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీపీఐ జిల్లా కార్యదర్శులు పవన్, ఖాలేద్, రెహమాన్, షఫీ, అహ్మద్, సునీత, తాజొద్దీన్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రగతి పరుగులు

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు

పటాన్‌చెరు టౌన్: ప్రగతి పరుగులు పెట్టాలంటే ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, బీఆర్‌ఎస్ అంటే ప్రగతి అని, బీజేపీ అంటే అధోగతి అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలో రూ.10 కోట్లతో నూతన మంజీర పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మైత్రిగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో.. 250 మంది దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ కోతలు ఉండేవని, ప్రస్తుతం 24 గంటల కరెంట్‌తో పరిశ్రమల్లో ఉపాధి పెరిగిందన్నారు. పటాన్‌చెరులో కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రభుత్వం అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని శివనగర్‌లో ఎల్‌ఈడీ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఉస్మాన్‌నగర్‌లో 400 ఎకరాల్లో ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఏ ఒక్క మంచి పథకమైనా తెచ్చిందా అని ప్రశ్నించారు. దివ్యాంగుల కోసం రూ.3 కోట్లతో 250 ద్విచక్ర వాహనాలు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందన్నారు. ఒకవైపు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు త్వరలోనే సీఎం కేసీఆర్‌తో చర్చించి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రూ.250 కోట్లతో ఏర్పాటు చేయనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులకు త్వరలోనే సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవారెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్ తరఫున ప్రతి ఏడాది పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించడంతో పాటు స్వయం ఉపాధి కల్పించేందుకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగుల కోసం ద్విచక్ర వాహనాలు పంపిణీ చేయడం గొప్ప కార్యక్రమము అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి హరీశ్ రావు, పక్కన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

క్లుప్తంగా

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో అక్రమంగా కొనసాగుతున్న గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం దాడులు చేపట్టారు. జిల్లా సివిల్ సప్లై అధికారి వనజ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 145 సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.

పేలిన ట్రాలీఆటో టైరు

ఒకరికి తీవ్రగాయాలు



మహేశ్ కు చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది

పటాన్‌చెరు టౌన్: ట్రాలీఆటో టైరుపేలిన ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం పటాన్‌చెరు నుంచి స్క్రాప్‌బ్యాటరీ లోడ్‌ను చాదర్‌ఘాట్‌కు తీసుకెళుతుండగా, పాటి గ్రామశివారు ఓఆర్ఆర్ సమీపంలోకి రాగానే టైరుపేలి ఆటో బోల్తా కొట్టింది. దీంతో డ్రైవర్ మహేశ్‌తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన బైరి ఐలయ్య మంగళవారం తన కాడెద్దులను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది.

రోడ్డు దాటుతుండగా..



పునుగు పిల్లి కళేబరం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలో ఖాజీపల్లి అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా పునుగుపల్లి మృతి చెందింది. మంగళవారం ఉదయం రోడ్డుపై పునుగు పిల్లి కళేబరం పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. సమీప అటవీప్రాంతంలో వీటి సంచారం ఎక్కువగా ఉందన్నారు.


శ్రీవిద్యాసరస్వతి క్షేత్రానికి 'భోగ్' సర్టిఫికెట్

ఫుడ్‌సేఫ్టీలో జాతీయస్థాయి గుర్తింపు

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రానికి భోగ్ (దేవుడికి సమర్పించే పరిశుభ్రమైన నైవేద్యం) సర్టిఫికెట్ వచ్చింది. ఈ సర్టిఫికెట్ గుర్తింపు 2023 మార్చి 28 నుంచి 2025 మార్చి 27 వరకు ఉంటుంది. శుచి, శుభ్రతకు మారుపేరుగా నిలిచిన వర్గల్ ఆలయం 'భోగ్' గుర్తింపు పొందిన అతి తక్కువ దేవాలయాల్లో ఒకటిగా నిలిచింది. మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశాలతో రాష్ట్ర ఆహార భద్రత అధికారులు వర్గల్ శ్రీవిద్యాసరస్వతి ఆలయంతోపాటు రాష్ట్రంలోని మరో 5 దేవాలయాల వివరాలను జాతీయస్థాయి 'భోగ్' సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆ తర్వాత పలుమార్లు కేంద్రం నుంచి ప్రత్యేక ఆడిట్ బృందం శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రాన్ని సందర్శించింది. నైవేద్యం, అన్నప్రసాదాల నాణ్యత, కిచెన్ నిర్వహణ, ఆహారం తయారు చేసే విధానం, శుచి, శుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఫుడ్‌సేఫ్టీ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందని వారు నిర్ధారించుకుని 'భోగ్' గుర్తింపుకు వర్గల్ క్షేత్రాన్ని రిఫర్ చేశారు.

మంత్రి ఆదేశాలతో 'భోగ్' టార్గెట్‌గా..

మంత్రి హరీశ్‌రావు ఆదేశాలతో భోగ్ సర్టిఫికెట్ టార్గెట్‌గా రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ విభాగం విశేష కృషి జరిపింది. భోగ్ ప్రోగ్రాం రాష్ట్ర నోడల్ అధికారిణి జ్యోతిర్మయి ఆధ్వర్యంలోని బృందం వర్గల్ దేవాలయాన్ని సందర్శించి నైవేద్యం, అన్నప్రసాదాలు తయారీలో అనుసరించాల్సిన నాణ్యత ప్రమాణాలపై, శుభ్రత విషయంలో పాటించాల్సిన పద్ధతులపై ఆలయ నిర్వాహకులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏటా 5 లక్షలమందికి పైగా భక్తులకు నిత్యాన్నదాన మహాప్రసాదం అందజేస్తున్న వర్గల్ క్షేత్రాన్ని కేంద్ర బృందం ఫైనల్ ఆడిట్ జరిపిన అనంతరం జాతీయస్థాయి భోగ్ గుర్తింపు లభించింది.



Sri Vidya Saraswathi Saneschara Temple

WARGAL SIDDIPET, TELANGANA

is certified as

Eat Right

PLACE OF WORSHIP

as per benchmarks established by

Food Safety and Standards Authority of India

for the period of 28th march, 2023 to 27th March, 2025

'భోగ్' గుర్తింపు పత్రం



వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రం

హర్షం వ్యక్తం చేసిన మంత్రి హరీశ్‌రావు

వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రానికి భోగ్ గుర్తింపు లభించడం సంతోషించదగ్గ విషయమని మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి సంతోషం వ్యక్తం చేశారు. ఆలయం తరఫున మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బస్సు నడుపుతుండగా.. డ్రైవర్‌కు గుండెనొప్పి



పటాన్‌చెరు ఆస్పత్రిలో మొయినుద్దీన్

పటాన్‌చెరు టౌన్: ఆర్టీసీ బస్సు నడుపుతుండగా, డ్రైవర్‌కు గుండెలో నొప్పిగా అనిపించింది. వెంటనే అప్రమత్తమై ప్రయాణికులను పటాన్‌చెరు బస్టాండ్‌లో దింపాడు. ఆపై కండక్టర్ సాయంతో ఆస్పత్రికి వెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేటకు చెందిన మొయినుద్దీన్ రాణిగంజ్ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాణిగంజ్ టు పటాన్‌చెరు బస్సు నడుపుతున్నాడు. మంగళవారం కూడా డ్యూటీలో భాగంగా డిపో నుంచి బయలుదేరాడు. బస్సు ఆర్‌సీపురం వద్దకు రాగానే మొయినుద్దీన్‌కు గుండె నొప్పి ప్రారంభమైంది. వెంటనే అప్రమత్తమై పటాన్‌చెరు బస్టాండ్ వరకు ప్రయాణికులను సురక్షితంగా తీసుకొచ్చాడు. అనంతరం కండక్టర్‌కు చెప్పగా, చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. విషయం ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అక్కడ నుంచి తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

అల్లరి చేసిన యువకులకు కౌన్సెలింగ్

నర్సాపూర్: ఓ ప్రైవేటు కాలేజీ బస్సును ఫాలో చేస్తూ విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్న యువకులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ మంగళవారం ముగియడంతో సంగారెడ్డి నుంచి ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థినులు బస్సులో నర్సాపూర్‌కు వస్తున్నారు. ఈ సమయంలో శివ్వంపేటతండాకు చెందిన ఇద్దరు యువకులు, తునికికి చెందిన మరో యువకుడు బైక్‌పై బస్సును వెంబడించారు. విద్యార్థినులను చూస్తూ అల్లరిగా కేకలు వేశారు. ఇబ్బంది పడిన ఆ విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. నర్సాపూర్ మార్గంలోని ఓ కిరాణ దుకాణం వద్దకు కాలేజీ బస్సును నిలపగా, తల్లిదండ్రులు అక్కడకు చేరుకున్నారు. బస్సు వెనకే వస్తున్న ముగ్గురు యువకులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై ఎస్ఐ శివకుమార్‌ను వివరణ కోరగా, బస్సు సిబ్బంది ఫిర్యాదు చేశారని, యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపాలని కోరారన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో ఆ యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చామని ఎస్ఐ చెప్పారు.

తల ఒక చోట... మొండెం మరోచోట

భూతగాదాలతో దారుణ హత్య



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఝరాసంగం(జహీరాబాద్): భూవివాదంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం...ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామానికి చెందిన చంద్రయ్య(60) మంగళవారం గ్రామశివారులో పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా, తమ్ముడి కుమారుడు రాకేష్ పాతకక్షలు, భూతగాదాలు మనసులోకి ఉంచుకొని తన వద్ద ఉన్న కత్తితో నరికి చంపేశాడు. అంతటితో ఆగకుండా తలను గ్రామంలోకి తీసుకెళ్లాడు. అక్కడి నుంచి ఝరాసంగం గ్రామ శివారులోని ఓ పెట్రోల్ పంపు వద్ద పడేశాడు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ వెంకటేశం, ఎస్ఐలు రాజేందర్‌రెడ్డి, వినయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు వినియోగించిన కత్తిని సంఘటనస్థలం నుంచి స్వాధీనం చేసుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతుడికి కుమారుడితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హత్య చేసిన వ్యక్తి అదుపులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తలను తీసుకుని గ్రామంలోకి రావటంతో గ్రామస్తులు తీవ్ర భయందోళనకు గురయ్యారు.

ముర్రుపాలు అమృతంతో సమానం



వివరాలు నమోదు చేసుకుంటున్న డాక్టర్ వినోద ఉన్నమ్

గజ్వేల్‌రూరల్: పుట్టిన బిడ్డకు గంటలోపు పట్టించే ముర్రుపాలు అమృతంతో సమానమని బీఎఫ్‌హెచ్ఐ (బేబీ ఫ్రెండ్లీ హాస్పిటల్ ఇన్సియేటివ్) డాక్టర్ వినోద ఉన్నమ్ అన్నారు. బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా(బీపీఎన్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు, సిబ్బందికి తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టిస్తే కలిగే ఉపయోగాలు, పాలు పట్టించే విధానం అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆస్పత్రిలో ఐఎంఎస్ చట్టం అమలు, చిన్నారులకు పాలు పట్టించే విధానం, బాలింతలకు అందిస్తున్న కౌన్సిలింగ్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్, ఆర్ఎంఓ డాక్టర్ రాము, గైనకాలజిస్ట్ డాక్టర్ మంజుల, డాక్టర్ శాంతన్‌రెడ్డి, డాక్టర్ జ్యోతి, నర్సింగ్ సూపరింటెండెంట్ శాంతకుమారి పాల్గొన్నారు.

జ్యూస్ సెంటర్ సీజ్



మిరుదొడ్డి(దుబ్బాక): పలువురి అస్వస్థతకు కారణమైన ఓ జ్యూస్ సెంటర్ అధికారులు సీజ్ చేశారు. మిరుదొడ్డిలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి జ్యూస్ పాయింట్ పేరుతో నరేష్ పలురకాల జ్యూస్‌లు తయారు చేసి విక్రయిస్తున్నాడు. రెండు రోజుల క్రితం జ్యూస్ పాయింట్‌లో వివిధ రకాల జ్యూస్‌లు తాగిన 30 మంది తీవ్రఅస్వస్థతకు లోనయ్యారు. వారంతా మిరుదొడ్డి, దుబ్బాక, సిద్దిపేటలో చికిత్స పొందారు. జ్యూస్ విక్రయిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొందరు బాధితులు అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంపీఓ జహరొద్దీన్, గ్రామ సర్పంచ్ రంగసబోయిన రాములు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పహీంలు జ్యూస్ పాయింట్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే జ్యూస్ నిర్వాహకుడు పారిపోయాడు. దీంతో అధికారులు ఆ జ్యూస్ సెంటర్‌ను సీజ్ చేశారు.



జొన్నచొప్ప లోడ్‌తో వెళుతుండగా...

జహీరాబాద్: జొన్నచొప్ప లోడ్‌తో వెళుతున్న డీసీఎంకు మంటలు అంటుకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మల్‌చల్మ గ్రామానికి చెందిన డీసీఎం యజమాని ఖలీద్ పట్టణంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన నసీర్ వద్ద మంగళవారం సాయంత్రం జొన్నచొప్ప కొనుగోలు చేశాడు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ శివారు నుంచి చొప్ప లోడ్‌తో వెళుతున్న డీసీఎంకు విద్యుత్ తీగలు తగలి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. దీంతో పరిసరాల్లో ఉన్న కాలనీవాసులు నీరు పోసి మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం ఫైరింజన్ సహాయంతో మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40వేల విలువగల చొప్ప దగ్ధమైంది.

విద్యార్థి అదృశ్యం



ఇబ్రహీం(ఫైల్)

కంది(సంగారెడ్డి): పాఠశాల నుంచి విద్యార్థి అదృశ్యమయ్యాడు. రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం..కందిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో కోహీర్ మండలం కవేలి గ్రామానికి చెందిన మహమ్మద్ సొద్ ఇబ్రహీం పదోతరగతి చదువుతున్నాడు. ఈనెల 27వ తేదీన సాయంత్రం 5:30 గంటలకు పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. ఇబ్రహీం కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ప్రిన్సిపాల్ ఉషశ్రీ మంగవాళం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

కొండపాక(గజ్వేల్): పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో పార్ల జయరాములుకు మూడేళ్ల జైలు, రూ. 3వేలు జరిమానా విధిస్తూ మంగళవారం సిద్దిపేట జిల్లా ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి భవాని తీర్పు చెప్పారని కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గిరాయిపల్లికి చెందిన పార్ల జయరాములు ప్రేమపేరుతో ఓ మైనర్ వెంటపడడంతో 2019లో కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి ఎస్ఐ పరమేశ్వర్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

ఒకదాని వెనుక మరోటి

లారీ, బస్సు, కారు ఢీ..తప్పిన ప్రమాదం

మనోహరాబాద్(తూప్రాన్): హైదరాబాద్ వైపు వెళుతున్న లారీని ఎక్స్‌ప్రెస్ బస్సు, కారు ఒకదానికి ఒకటి ఢీకొన్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి ప్రయాణికులతో గరుడా ఎక్స్‌ప్రెస్ బస్సు హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో మండలపరిధిలోని కాళ్లకల్ గ్రామ శివారులోకి రాగానే జాతీయ రహదారిపై స్టీల్ లోడ్‌తో వెళుతున్న లారీ ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో వెనుక వస్తున్న బస్సు దానిని ఢీకొట్టింది. అదే వరుసలో ఉన్న కారు సైతం బస్సును ఢీ కొట్టింది. పలువురికి చిన్న చిన్న గాయాలయ్యాయి. ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

వైద్యం కోసం వెళితే...



తీవ్రంగా గాయపడిన నరేశ్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): అనారోగ్యంతో చికిత్సకు వెళ్లిన ఓ యువకుడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఎస్ఐ మధుసూధన్‌గౌడ్, బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌గౌడ్ వైద్యం కోసం సోమవారం రాత్రి వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. ఆస్పత్రి నిర్వాహకుడైన ఆర్‌ఎంపీ సకాలంలో స్పందించలేదు సరికదా అతని కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన యువకుడిపై కర్రతో దాడిచేశాడు. దీంతో నరేశ్ తలపై తీవ్రగాయాలై రక్తంతో దుస్తులు పూర్తిగా తడిసిముద్దయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అతడు కోమాలోకి వెళ్లాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమై.. ఆపై శవమై

పాపన్నపేట(మెదక్): ఐదురోజుల క్రితం అదృశ్యమైన ఓ యువకుడు శవమై కనిపించాడు. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం..మండల పరిధిలోని దుమ్లాతండాకు చెందిన ధరావత్ శ్రీకాంత్(24) ఈనెల 23వ తేదీన అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యులు వెతికినా, ఆచూకీ లభ్యం కాలేదు. తమ్మాయిపల్లి శివారులో శవమై కనిపించాడు. అయితే ఫిట్స్‌తో చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలలో చోరీకి యత్నం



కొల్చారం(నర్సాపూర్): కొల్చారం ప్రాథమిక పాఠశాలలో చోరీకి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం ఉదయం పాఠశాల తెరిచేందుకు ఉపాధ్యాయులు వెళ్లగా, తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇటీవల పాఠశాలకు మన ఊరు –మనబడి కింద విలువైన వస్తువులు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే చోరీకి యత్నించినట్లు అనుమానిస్తున్నారు. ఈ విషయమై కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోతున్న పూరిగుడిసె

చేగుంట(తూప్రాన్): షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..మండలపరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన ఎర్రస్వామి మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నంవేళ ఆయన నివసిస్తున్న పూరిగుడిసెకు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చేలోపే గుడిసెలో దాచిన నగదు, బంగారం, సర్టిఫికెట్లు దుస్తులు కాలిపోయాయి. రెవెన్యూ అధికారులు సంఘటనస్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ



నర్సాపూర్ రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైరును దొంగిలించారు. రైతులు చెప్పిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని కాజీపేటలో చంద్రమ్మ పొలం వద్ద 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీని పరిధిలో 15 వ్యవసాయ బోరుమోటార్లు నడుస్తున్నాయి. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, అందులోని కాపర్ ఎత్తుకెళ్లారు. దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని రైతులు వాపోయారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి హామీ పనికెళ్లి...



రావుల లచ్చమ్మ (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధిహామీలో భాగంగా కూలి పనికి వెళ్లిన ఓ మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. రోజుమాదిరిగానే మంగళవారం బెజ్జంకి శివారులోని పాపన్నపల్లెలో ఉపాధిపనికి తట్ట, పార తీసుకుని రావుల లచ్చవ్వ (55) వెళుతుండగా, ఒక్కసారిగా కళ్లు తిరిగి కింద పడింది. వెంటనే కరీంనగర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా, లచ్చవ్వ అప్పటికే మృతి చెందింది. మృతురాలి కుమారుడు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ కొంరయ్య తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏపీడీ ఓబులేష్, ఎంపీడీఓ రాములు పరిశీలించారు. అక్కడే ఉన్న కూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



బావిలో యువకుడి మృతదేహం

పెద్ద శంకరంపేట(మెదక్): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బావిలో లభ్యమైంది. పెద్ద శంకరంపేట ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేట శివారు రేగోడు వెళ్లే దారిలో పొట్లోళ్ల బాయిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం ఉందని మంగళవారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. వారు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వయసు 35 సంవత్సరాలు ఉంటుందని, వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

సంగారెడ్డి టౌన్: రోడ్డుప్రమాదంలో గుర్తు తెలియనివ్యక్తి మృతి చెందాడు. సంగారెడ్డి రూరల్ పోలీసుల కథనం ప్రకారం..మంగళవారం ఉదయం సంగారెడ్డి పెప్సీ ఫ్లైఓవర్ వద్ద గుర్తు తెలియనివ్యక్తిని ఓ వాహనం ఢీకొనగా బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, ఎరుపురంగు బనియన్, నలుపురంగు పాయింట్ ధరించాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చ్యురీలో భద్రపరిచామని, వివరాలు తెలిస్తే...8712656719, 8712656746, 8919785080 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వివాహితపై కత్తితో దాడి



గాయపడిన స్రవంతి

రామాయంపేట(మెదక్): వివాహితపై ఓ యువకుడు కత్తితో దాడి చేశాడు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ప్రగతిధర్మారం గ్రామానికి చెందిన చౌకి స్రవంతి మంగళవారం తన ఇంట్లో పడుకొని ఉండగా, అదే గ్రామానికి చెందిన యువకుడు ఆమెపై దాడిచేసి కత్తితో ఇష్టమొచ్చినట్టు పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమె అరుపులతో సదరు యువకుడు పారిపోయాడు. గాయపడిన స్రవంతిని చికిత్స నిమిత్తం 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రసుత్తం ఆమె పరిస్థితి విషమంగానే ఉంది. పరారీలో ఉన్న యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారుల్లో ఒకరికి జైలు, కొందరికి జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సాపూర్, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై నాలుగు రోజుల క్రితం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మంది మద్యం తాగి వాహనాలు నడు పు తూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి రూ.26వేల జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంగారెడ్డి టౌన్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పోషణ్ అభియాన్ శిక్ష సమన్వయకర్త సౌమ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని పాత డీఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా సమాఖ్య సమావేశంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యం, పెరటి తోటల పెంపకం, పిల్లల పెరుగుదల, పోషకాహారం, ఆహార వైవిధ్యం, పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు. ప్రతి మండల, గ్రామ మీటింగ్‌లలో చిరుధాన్యాల ప్రాముఖ్యత, సాగు గురించి వివరించాలన్నారు. అనంతరం పోషణ పక్షం పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, పోషణ అభియాన్ శిక్ష కోఆర్డినేటర్ సౌమ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్‌టీ కోక్ తగిలి కానిస్టేబుల్‌కు గాయాలు

- ఏకే–47 శుభ్రపరుస్తుండగా ఘటన
- సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స.. ఆపై హైదరాబాద్‌కు తరలింపు



సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రాజశేఖర్

సిద్దిపేటకమాన్: గన్ శుభ్రం చేస్తుండగా లోపల ఉన్న ఎమ్‌టీ కోక్ తగిలి ఓ ఏఆర్ కానిస్టేబుల్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన ఎస్. రాజశేఖర్ సిద్దిపేట సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సాయుధ దళాల వార్షిక పునశ్చరణలో భాగంగా రాజగోపాల్‌పేటలో పోలీస్ ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించి, అనంతరం ఆయుధాలను సీఏఆర్ హెడ్ క్వార్టర్‌కు తరలించారు. విధుల్లో ఉన్న రాజశేఖర్ మంగళవారం ఏకే 47 తుపాకీని శుభ్రం చేస్తుండగా లోపల ఇరుక్కుపోయిన ఎమ్‌టీ కోక్ ఒత్తిడికి గురై బలంగా వెనక్కి రావడంతో కుడి కన్ను, భుజానికి తగిలింది. ఘటనలో గాయపడిన రాజశేఖర్‌ను పోలీసు సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ సరోజినీదేవి కంటి ఆస్పత్రికి తరలించారు. రాజశేఖర్‌కు అందుతున్న వైద్య సేవలపై సీపీ శ్వేత ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యాధికారులకు సూచించారు.